ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్టం 37.8 • కనిష్టం 22.6
నిర్మల్
జిల్లా వార్తలు
8
గురువారం 13 మార్చి 2025



ఆరోగ్య మందిరాల
నిధులపై కన్ను



- విడుదల అయ్యి నెలలు గడుస్తున్నా జమ చేయని వైనం
- ప్రోగ్రాం అధికారి అలసత్వమే ఆసరాగా జిల్లా యంత్రాంగం
- చేతివాటం కోసం యత్నాలు
- కేంద్రాల్లో సిబ్బందికి పెరిగిపోతున్న అప్పులు
- కలెక్టర్‌కు ఫైల్ పెట్టకపోవడంపై అనుమానాలు
- డీఎం అండ్ హెచ్‌వోను తప్పుదోవ పట్టిస్తున్న కార్యాలయ సిబ్బంది..?

నిర్మల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు గాను ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా మార్చిన విషయం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ఆయుష్ ఆరోగ్య మందిరాలకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ కేంద్రాల్లో రోగులకు కనీస సేవలు అందించడంతో పాటు ఆ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది అవసరాల కోసం ఈ నిధులు ఖర్చు చేసేందుకు రూపకల్పన చేశారు. జన ఆరోగ్య సమితి కమిటీల పేరుతో ఆరోగ్య మందిరాల్లో పనిచేసే సిబ్బంది ప్రజా ప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, గర్భిణీ స్త్రీలను ఈ కమిటీలలో సభ్యులుగా నియమించారు. ఈ కమిటీలు తీసుకునే నిర్ణయం ప్రకారం ఆరోగ్య మందిరాలకు మంజూరైన నిధులను ఖర్చు చేయాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను ఆరోగ్య మందిరాలకు విడుదల చేయకపోవడంపై అనేక ఆరోపణలు విని పిస్తున్నాయి. నిధులను కాజేసే కుట్రలో భాగంగానే ఈ వ్యవహారం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిధుల విడుదలలో జాప్యం ఎందుకు ?

ఆరోగ్య మందిరాలకు నిధులు విడుదలై నెలలు గడుస్తున్నప్పటికీ ఆ నిధులను జన ఆరోగ్య సమితి కమిటీల ఖాతాలకు జమ చేయక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని అవ ం లు చేస్తున్న ఓ అధికారిని తప్పించి ఇటీవలనే మరొక అధికారికి బాధ్యతలు ఇచ్చారు. దీని వెనుక పెద్ద మొత్తంలో కుట్ర దాగి ఉన్నట్లు చెబుతున్నారు. కొత్తగా నియామకం అయిన అధికారి అలసత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి నిధులను ఎలా కాజేయాలో ప్లాన్ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారిని తప్పుదోవ పట్టిస్తూ ఈ నిధులను కాజేసే యత్నం జరుగుతున్న ఆరోపణలు ఉండగా... జిల్లా అధికారికి తెలియకుండా భారీ మొత్తంలో మంజూరైన నిధుల వ్యవహారంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో 73 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నడుస్తున్నాయి. ఈ మందిరాల్లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పని చేస్తుంటారు. మంజూరైన నిధులను జన ఆరోగ్య సమితి ఖాతాలలో ఇప్పటికే జమ చేయాల్సి ఉంది. ఇంతవరకు జమ చేయకపోవడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో ఉన్న అధికారి నిధులు విడుదల చేయాలని జిల్లా అధికారిపై ఒత్తిడి తెచ్చారని అంటున్నారు. అయితే అధికారి త్వరలోనే ఉన్నత చదువులకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా కొత్త అధికారికి బాధ్యతలు ఇచ్చారు. ఆయనకు బాధ్యతలు ఇచ్చి కూడా అటు ఇటుగా ఆరు నెలలు అవుతున్నది. అయితే ఈ అధికారి స్థానికంగా ఉండకపోవడంతో పాటు చుట్టం చూపుగా వచ్చి వెళ్తారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారి అలసత్వాన్ని ఆసరా చేసుకున్న కార్యాలయంలో పని చేస్తున్న ఒక సీనియర్ ఉద్యోగి మొత్తం జిల్లా యంత్రాంగాన్ని పక్కదారి పట్టించే యత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఆ ఉద్యోగి సలహా మేరకే జిల్లా అధికారులు సైతం నడుస్తున్నారని అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే దాకా నిధులను అలగే ఉంచి ఆ తర్వాత కాజేసే యత్నం జరుగుతున్నట్లు ఆ శాఖ వర్గాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కో మందిరానికి 75 వేలు..

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు ఒక్కో దానికి 75 వేల చొప్పున మంజూరు అయ్యాయి. ఈ నిధులు జిల్లా కార్యాలయంలో నెలల తరబడి మూలుగుతున్నాయి. నిధులు వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పెట్టి ఆ నిధులను వెంటనే జన ఆరోగ్య సమితి ఖాతాలకు జమ చేయాలి. కానీ ఇప్పటిదాకా కలెక్టర్‌కు ఫైల్ పెట్టకపోవడం కూడా సంబంధిత కార్యాలయ సిబ్బంది, అధికారుల తెగింపు తనానికి అద్దం పడుతున్నది. 50,000 అభివృద్ధి పనుల కోసంమరో 25 వేలు ఇంటర్నెట్ కనెక్షన్, ఇతర అవసరాల కోసం ఖర్చు చేయవలసి ఉన్నది. అయితే ఆయుష్మాన్ మందిరాలను నిర్వహిస్తున్న సిబ్బంది తమ జేబుల్లో నుంచి డబ్బులు ఖర్చు పెట్టుకుని కొన్ని పనులు చేశారు. నిధులు వస్తాయన్న నమ్మకంతో జేబులో నుండి డబ్బులు ఖర్చు పెడితే ఇప్పటికాదా అధికారులు విడుదల చేయకపోవడంతో సిబ్బందిలోనూ ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. వెంటనే నిధులు జమ చేయాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

నాకు పెద్దగా తెలియదు : ప్రోగ్రాం అధికారి

ఈ విషయంపై సంబంధిత ఆయుష్మాన్ ఆరోగ్య ప్రోగ్రాం అధికారి రాజారమేష్‌ను సంప్రదించగా ఈ విషయంలో తనకు పెద్దగా తెలియదని జిల్లా వైద్యాధికారికి తెలుసు అని చెబుతున్నారు. నిధులు వచ్చిన మాట వాస్తవమేనని ఖాతాలకు పంపించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే కొన్ని మందిరాల ఖాతాలు తెరవలేదని తెలిసింది. త్వరలోనే దీనిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ఎట్టకేలకు ఖానాపూర్

మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

- కడెం మండలానికి దక్కిన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి
- చైర్మన్‌గా పడిగెల భూమన్నకు అవకాశం
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీద్‌కు దక్కిన వైస్ చైర్మన్ పదవి

ఖానాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో తర్జన భర్జనల అనంతరం ఎట్టకేలకు ఖానాపూర్ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం నియమిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పదవికి ఈసారి ఎస్సీ రిజర్వేషన్ రావడంతో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ నాలుగు మండలాల నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పదవిని దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున పావులు కదిపారు. కాగా గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరుసగా ఖానాపూర్, పెంబి మండలాలకు చెందిన నాయకులకు దక్కడంతో ఈసారి ఆ పదవిని కడెం మండలానికి కేటాయిస్తూ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నిర్ణయం తీసుకున్నారు. ఆది నుంచి కడెం మండలం వైపే మొగ్గు చూపిన ఎమ్మెల్యే చివరికి కడెం మండలం బెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని హరిజనవాడకు చెందిన పడిగెల భూమన్నకు అవకాశం కల్పించారు.

వైస్ చైర్మన్ ఎంపికలో అనుభవానికి పెద్దపీట..

ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కడెం మండలానికి కేటాయించడంతో వైస్ చైర్మన్ పదవి ఖానాపూర్ మండలానికి దక్కింది. చైర్మన్ పదవి కడెం మండలానికి వెళ్తుందని ముందు నుంచే ప్రచారం జరిగిన నేపథ్యంలో వైస్ చైర్మన్ పదవి కోసం ఖానాపూర్ మండలంలో పలువురు ముఖ్య నాయకులు పోటీపడ్డారు. కాగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాత్రం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులైన మస్కాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ మాజీద్ వైపు మొగ్గు చూపారు. దీంతో పార్టీలో అనుభవానికి పెద్దపీట వేసినట్లు చెప్పుకుంటున్నారు. వీరితో పాటు డైరెక్టర్లుగా నాగావత్ పుల్యానాయక్, సోమిరెడ్డి నారాయణ రెడ్డి, దాతుర్క గంగాధర్, సాగి అశోక్ రావు, దండగుల యాదగిరి, తోకల మహేందర్, ఊరే జలజ, అడిదెల చిన్న రాజన్న, లక్కవత్తుల నారాయణ, తొడసం విఠల్, గంప దయాకర్, కట్కం శేఖరయ్య, కడెం పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఖానాపూర్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్‌లను డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాలక వర్గం పదవి కాలం రెండేళ్ల పాటు కొనసాగనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

26న ఖానాపూర్‌లో

ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

ఖానాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విజయ్ సెంటర్ సీహెచ్‌సీ ఖానాపూర్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన ఖానాపూర్‌లో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు నేత్ర వైద్య సహాయ అధికారి గంగవరం రాంరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఆపరేషన్ అవసరం ఉన్న ప్రజలు ముందుగా తమ పేరును ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ కొరకు వచ్చే వారు తమ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డులను వెంట తీసుకుని రావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9985737466 అనే నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

సోన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు కలుగుతుందని బీజేపీ నాయకులు నవీన్, పోశెట్టి అన్నారు. బుధవారం మండలంలోని సాకెర గ్రామంలో వందన ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించి, మాట్లాడారు. వైద్యులు గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజ్మెంట్ సురేష్ గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కడెంలో రోడ్డు ప్రమాదం

కడెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కడెం మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కడెంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ముందర ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ధర్మాజీపేట్‌కు చెందిన మగ్గిని ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేష్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు.

గ్రూప్ - 2లో 88వ ర్యాంకు



కుంటాల, మార్చి, 12 : (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రం కుంటాలకు చెందిన కార్గం గోవర్ధన్ గ్రూప్ 2 లో రాష్ట్ర స్థాయిలో 88 వ ర్యాంకు, బాసర జోన్‌లో 7 వ ర్యాంకు సాధించారు. 394. 5 మార్కులు సాధించినట్లు ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ఆయనను అభినందించారు.

వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి సాయికుమార్ మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదలచేయాలని, విద్యారంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, యూనివర్సిటీలకు బ్లాక్ గ్రాంట్‌ను వాటి బడ్జెట్ మేరకు పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తేజ, శేఖర్, సాయిప్రసాద్, అజయ్, గణేష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



సారంగాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జామ్ గ్రామ పాఠశాలలో కేఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వరయంలో బుధవారం విద్యార్థులకు పెన్నులతో పాటు బుక్స్‌ను, పోటీ పరీక్షల సామాగ్రిని ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రెడ్డి పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఏకా గ్రతతో చదువుకుంటూ మంచి మార్కులు తెచ్చుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకవచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, బి.నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, విద్యార్థులు ఉన్నారు.

భవిత సెంటర్‌ల ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ


బాలుడితో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భవిత సెంటర్ ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ ద్వారా వారికి స్వయం సమృద్ధి కల్పించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వీటి ద్వారా దివ్యాంగులు తమ దైనందిన జీవితాన్ని సులభతరం చేసుకోవచ్చునన్నారు. దివ్యాంగులు నిత్య జీవితంలో అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆలింకో సంస్థ సహకారంతో జిల్లాలో అర్హులుగా గుర్తించిన 91 మంది దివ్యాంగులకు సుమారు 7 లక్షల 70 వేల రూపాయల విలువ గల 133 ఉపకరణాలు వీల్‌చైర్లు, శ్రవణ, దృశ్య, తదితర పరికరాలను కలెక్టర్ అందించారు.

ఈ ఉపకరణాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, దివ్యాంగులు నిత్య జీవితంలో అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులతో మాట్లాడుతూ... వారి బాగోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వారికి అందజేసిన పరికరాలను సరిగ్గా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో పి. రామారావు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, విద్యాశాఖ అధికారులు లింబాద్రి, ప్రవీణ్, దివ్యాంగులు, పోషకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధనకు ఐక్య కార్యాచరణ ప్రకటిస్తాం

● డిగ్రీ కళాశాల సాధన ఉద్యమ సమితి నిర్వాహకులు కాశవేణి ప్రణయ్

ఖానాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధనకై ఉద్యమించేందుకు కలసి వచ్చే వారందరితో ఐక్య కార్యాచరణను ప్రకటిస్తామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధన ఉద్యమ సమితి నిర్వాహకులు కాశవేణి ప్రణయ్ అన్నారు. బుధవారం రాత్రి ఖానాపూర్‌లోని పీఆర్టీయూ భవన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధన ఉద్యమ సమితి ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమైక్య రాష్ట్రంలో ఖానాపూర్‌కు డిగ్రీ కళాశాల మంజూరు కాలేదని కనీసం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అయినా ఆ కల నెరవేరుతుందంటే అది ఇంకా కలగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న ఖానాపూర్‌లో నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా డిగ్రీ కళాశాల మాత్రం ఏర్పాటు చేయకపోవడం పట్ల వారు మండిపడ్డారు. పార్టీలకతీతంగా ఐక్య కార్యాచరణను రూపొందించి ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధించేందుకు దశల వారీగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశంలో అందరి అభిప్రాయాలను తెలుసుకొని ఒక స్పష్టమైన ఉద్యమ కార్యాచరణతో ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సాధిస్తామని ఈ సందర్భంగా ప్రణయ్ ప్రకటించారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణను వెల్లడిస్తామన్నారు. కాగా ఖానాపూర్ ప్రాంత నిరుపేద విద్యార్థులకు ఎన్నో ఏళ్లగా అందని ద్రాక్షలా మారిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై పోరాటం చేసేందుకు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్న ప్రణయ్‌ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యార్థి సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ఆయా సంఘాల నాయకులు

ఇంటి పన్ను

వంద శాతం వసూలు చేయాలి

ముథోల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శుఉ ఇంటి పన్నును వారం రోజులలోపు వంద శాతం పూర్తి చేయాలని డీఎల్పీవో సుదర్శన్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేవంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని పారిశుద్ధ్యం, త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయాలని ఇంటి పన్నులను ప్రతి ఒక్కరూ 100 శాతంపూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీషారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాజేశ్వర్ మృతి


వడ్నపు రాజేశ్వర్ (ఫైల్)

భైంసా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డు తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వడ్నపు రాజేశ్వర్ (48) బుధవారం మృతి చెందాడు. స్థానిక గణేష్‌నగర్ కాలనీకు చెందిన ఆయన గత కొంత కాలంగా అనారోగ్యపు కారణాలతో అస్వస్థత చెందగా మంగళవారం అర్ధ రాత్రి వేళ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది.దీంతో కుటుంబ సభ్యులు చికిత్సల నిమిత్తం స్థానిక ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం సాయంత్రం వేళలో మృతి చెందాడు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 23వ వార్డు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి కౌన్సిలర్‌గా గెలుపొందిన వడ్నపు రాజేశ్వర్ వార్డు అభివృద్ధికి అవిరళంగా కృషి చేశారు. స్వంత డబ్బులు సైతం వెచ్చించి వార్డు పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించడమే కాకుండా అభివృద్ధి పనులు చేపట్టారు. వార్డు పరిధిలో ఇటీవల నిర్మించిన బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ ప్రక్రియలో ప్రధాన భాగస్వామ్యాన్ని అందించారు. అందరివాడుగా పేరొందిన వడ్నపు రాజేశ్వర్ మృతితో భైంసా పట్టణ పరిధిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేశవాళీ ఆవుల సంరక్షణకు మద్దతు ఇవ్వండి

● టీటీడీ చైర్మన్‌కు వినతి



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో దివ్యరెడ్డి

నిర్మల్ కల్చరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : క్రాస్ బ్రీడింగ్‌తో దేశంలో అంతరించిపోతున్న దేశవాళీ ఆవుల సంరక్షణకు మద్దతు ఇవ్వాలని క్లిమామ్ గోశాల వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యరెడ్డి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. బుధవారం ఆమె టీటీడీ చైర్మన్‌ను కలిశారు. దేశవాళీ ఆవుల సంరక్షణకు 'సేవ్ దేశీ కౌస్' పేరుతో చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. దేశీయ పశుసంపద కనుమరుగైపోకుండా వాటిని సంరక్షించి భవిష్యత్ తరాలకు సంపద అందించేందుకు ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. టీటీడీ చైర్మన్ సానుకూలంగా స్పందించి మద్దతుకు హామీ ఇచ్చినట్టు దివ్యరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసుల ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నిర్మల్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామంలోని బైపాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ చాలన్ తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్, 15 ఈ చాలన్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ డీఎస్పీ హసీబుల్లా సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ఆదిలాబాద్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతో సైబర్ క్రైంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళలలో సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించడానికి ర్యాలీ చేపట్టినట్లు ఆయన తెలిపారు. అనుమానిత ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సునీల్ కుమార్, షీ టీం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో జన ఔషధి కేంద్రం ప్రారంభం

ఉట్నూర్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ గిరిజన ప్రాంతాల ప్రజలకు ప్రధానమంత్రి జన ఔషది పథకం అందుబాటులోకి వచ్చింది. బుధవారం ఉట్నూర్‌లో ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన జన ఔషది కేంద్రాన్ని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అనేక మంది ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల భారీన పడుతున్నారని, అందుకు కావాల్సిన మందులను ప్రతీరోజు వాడాల్సిందేనని, దీంతో పేద ప్రజల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ జన ఔషధి పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సాయి, శ్రీరామ్ నాయక్, కొండేరి రమేష్, నాగభూషణం, సాడిగే రాజేశ్వర్, కుటికల ఆశన్న, వెంకటేష్, తన్నీరు,డాక్టర్ సాడగే రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యా రంగానికి నిధులు కేటాయించాలి'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయాల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ కేటాయించాలన్నారు. ఇందులో నిఖిల్, మహేశ్, సాయి, గణేష్ పాల్గొన్నారు.

'మున్ముందు అన్నీ డిజిటల్ చెల్లింపులే'

ఉట్నూర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో నగదు చెల్లింపుల కంటే డిజిటల్ చెల్లింపులే అధికం అవుతాయని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఆర్‌బీఐ ఆధ్వర్యంలో డిజిటల్ చెల్లింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ నెట్‌బ్యాలెన్స్ ద్వారా ఫోన్‌పే, గూగుల్‌పేలు చెల్లించి తమ అవసరాలను ఫోన్ ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. రిజర్వ్‌బ్యాంక్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ బీఎల్ రాయుడు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో లిక్విడ్ క్యాష్ ఉండదని, దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులతోనే అన్ని పనులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్ హబీబుల్లా, ఎఫ్‌వన్ మేనేజర్ మహతి, ఫీల్డ్ ఆఫీసర్లు, మణికుమార్, సుదాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.



సరిహద్దులోని పెన్‌గంగా బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



జైనథ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జైనథ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దున గల తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దున గల పెన్ గంగా బ్రిడ్జి వద్ద అక్రమంగా వచ్చే నిషేధిత వస్తువులను అరికట్టడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజాన్ అన్నారు. బుధవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని పిప్పర్‌వాడ టోల్ ప్లాజా, బోరజ్ చెక్ పోస్టులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. దీంతో తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దున గల డోల్లార పెన్‌గంగా నది సరిహద్దును సందర్శించి నిషేధిత వస్తువులు రాష్ట్రంలోకి చొరబడకుండా జైనథ్ మండల పోలీసులు తగు నిఘా వహించాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. ఆ తర్వాత మండల కేంద్రమైన జైనథ్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించి వారితో మాట్లాడి పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటారు. జైనథ్‌కు మొదటిసారి వచ్చిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ.అశోక్‌రెడ్డి జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి,జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్, జైనథ్ ఎస్సై వి.పురుషోత్తంలతో పాటు జైనథ్ పోలీసులు, అలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ నోటిఫికేషన్‌లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి దానిని విస్మరించారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ ఫలితాలను డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. మాదిగలను సీఎం మోసం చేస్తున్నారని ఆరోపించారు. అన్నిరకాల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్: టీపీఎస్సీ ఆధ్వర్యంలోని గ్రూపు 1, 2 3 పోస్టుల భర్తీని ఎస్సీ వర్గీకరణ అయ్యేంత వరకు నిలుపుదల చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం రెండవ రోజు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలాజిమాదిగ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలన్నారు. ఉద్యోగ నియమకాల్లో మాదిగలకు, మాదిగ ఉప కులాలకు ద్రోహం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నందున మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ శాసనసభ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన పోటిఫికేషన్‌లకు వర్తించేలా చట్టంలో రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల కాంతారావు, దాసరి రాంప్రసాద్, అశోక్, అందరిబాలాజి, మోరేవిష్ణు, మోరేసురేష్, మాదవ్, దావుల రమేష్, తదితరులు పాల్గొన్నారు

● 'ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి'

బోథ్: సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ ఎస్సీ వర్గీకరణకు శాస్త్రీయబద్ధంగా అసెంబ్లీలో తీర్మానం చేశారు. చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ మాదిగ పిలుపు మేరకు దీక్షా శిబిరాన్ని ప్రారంభించామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు కుడాల స్వామి పేర్కొన్నారు. ప్రభుత్వం సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కారం రవి, మండల కన్వీనర్ ఐన్ల మహేష్, తిక్క రమణయ్య, అశోక్, సదాశివ్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.



భీంపూర్‌లో నీటితడులు అందక ఎండిపోతున్న మొక్కజొన్న పంట

పంటలు ఎండవట్టే..

(5వ పేజీ తరువాయి...)

తరలిస్తున్నారు. ఇప్ప టికే కొంత మంది రైతులు పంట చేన్లలో బోరుబావులను తవ్విస్తున్న నీటిజాడలు కనిపించక పోవడంతో బోరుమంటున్నారు. అలాగే సమీపంలో ఉన్న నదుల నుంచి నీటిని తరలించేందుకు వేల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. కొంతమంది రైతులైతే పక్కనే ఉన్న రైతు చేన్ల నుంచి నీటిని తరలించేందుకు ఎంతో కొంత సొమ్మును చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయినా మండిపోతున్న ఎండలకు రోజుల వ్యవధిలోనే నీటితడులు ఆరి పోవడంతో చేసేదేమి లేక చేతులెత్తేస్తున్నారు. కళ్లముందే చేతికొచ్చిన పంట ఎండుముఖం పట్టడంతో పశువుల మేతగా వదిలేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందక పోవడంతో నష్టాల పాలవుతున్నారు.

అధికారుల ముందుచూపు ఏదీ !?

యాసంగి సీజన్‌లో సాగవుతున్న పంటలపై వ్యవసాయ శాఖ అధికారులకు ముందుచూపు కరువైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వేసవిలో నీటితడులు తక్కువగా అవసరమయ్యే ఆరుతడి పంటలను సాగు చేసుకునే విధంగా రైతులకు ముందే అవగాహన కల్పించి ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉండవంటున్నారు. ముఖ్యంగా పుచ్చకాయ, దోస, నువ్వులు, ధనియా, ఇతర కూరగాయల పంటలను సాగుచేసే విధంగా అన్నదాతలను సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. కాని వ్యవసాయ శాఖాధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడక పోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం పంటలు ఎండుముఖం పట్టడంతో అధికారులు గ్రామాల బాటపట్టిన పెద్దగా ప్రయోజనం ఉండదంటున్నారు. ముందే సలహాలు, సూచనలు అందించి ఉంటే రైతులు నష్టపోయే అవకాశం ఉండదంటున్నారు. కొంత మంది రైతులు సాగు అనుభవంతోనే వేసవిలో పంటలను సాగు చేస్తున్న భూగర్భజలాల పై సరైన అవగాహన లేక పోవడంతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు.

పేకాట స్థావరంపై దాడి : ఐదుగురి అరెస్టు

జైనథ్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని గిమ్మ గ్రామశివారుల్లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో జైనథ్ మండల ఎస్సై పురుషోత్తం పోలీసు సిబ్బందితో కలిసి బుదవారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఇందులో పేకాటముక్కలతో పాటు రూ.43290 డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులలో గంద్రత్ సతీష్, ఐన్ల కిరణ్‌కుమార్, కందుల సాయికృష్ణ, జి.సతీష్, ఎన్.రాకేష్‌లను పట్టుకున్నారు. మరో నిందితుడు శ్రీకాంత్ పరారీలో ఉన్నాడని ఎస్సై తెలిపారు. మండలంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను జరగకుండా ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచన మేరకు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో పోలీసు నిఘాను పెంచామని ఎస్సై వి.పురుషోత్తం తెలిపారు.

గంజాయి అమ్మితే కఠిన చర్యలు : సీఐ

మావల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలించినా అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఫణీందర్ పేర్కొన్నారు. బుధవారం ఎస్సై గౌతమ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేయగా పట్టణంలోని ధశ్నాపూర్ వద్ద యాక్టివా స్కూటిలో 176 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

'ముందస్తు అరెస్టులు హేయమైన చర్య'

ఇంద్రవెల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ హేయమైన చర్యకు నిదర్శనమని మండల మాజీ సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కుడే కైలాష్ అన్నారు. మండలంలోని పలువురు మాజీ సర్పంచులను పోలీసులు బుధవారం ముందస్తుగా అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం ఐదేళ్ల డబ్బులు పెట్టి పని చేసిన తమను అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచులు జాదవ్ లఖన్, జాకేశ్వర్, తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

భీంపూర్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్నారన్న సమాచారం మేరకు మడావి లింబాజీ, కేమ గంగయ్య, బక్కి కపిల్ యాదవ్, మడావి వినోద్‌లను ముందుస్తు అరెస్టు చేశారు. కాగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేకల నాగయ్య, మండ ల సోషల్ మీడియా కన్వీనర్ మేకల ప్రవీణ్‌లు ఖండించారు.

బోథ్: తమకు రావాల్సిసిన పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచుల సంఘం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు బుధవారం ఉదయం మాజీ సర్పంచ్‌ల ఇళ్లకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఇందులో బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రుక్మాన్సింగ్, సోమన్నలను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, బజార్‌హత్నూర్ మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ఇంద్రవెల్లిలో మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

బీజేఎల్పీ సమావేశం నిర్వహించిన మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన బీజేఎల్పీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బడ్జెట్‌పై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావించడంతో పాటు అసెంబ్లీ సమావేశాల కార్యాచరణ, తదితర అంశాలపై చర్చించి నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ శాసనసభ్యులు రాజాసింగ్, పాయల్ శంకర్, పైడి రాకేష్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్, శాసన మండలి సభ్యులు, ఏవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.


రబీంద్రలో తెలంగాణ

'ఉద్యమకారులు' పుస్తక పరిచయం

ముథోల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ ఉద్యమకారులు ముథోల్ నియోజకవర్గం అనే పుస్తక పరిచయం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పుస్తక పరిచయ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముథోల్ ఎస్సై సంజీవ్ హాజరై మాట్లాడారు. సజీవసాక్ష్యం తెలంగాణ ఉద్యమకారులు ముథోల్ నియోజకవర్గ చరిత్ర పుస్తకం నిలుస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డా. ముష్కం రామకృష్ణగౌడ్‌ను, పుస్తక సంపాదకులు జాదవ్ పుండలిక్ రావు పటేల్ అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ కవిరెడ్ల బాలాజీ, ఉద్యమకారులు దిగంబర్, అజీజ్, చంద్రకాంత్, సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

జిల్లా మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిని

అదుపులోకి తీసుకున్న పోలీసులు



సోన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాలు దృష్టిలో ఉంచుకొని జిల్లా మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తిరుక్కోవేల వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారని అడుగగా అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా అదుపులోకి తీసుకోమని పై అధికారులు తెలిపారని చెప్పారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టులు

నర్సాపూర్(జి) నర్సాపూర్(జి), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా నర్సాపూర్ (జి) మండలంలోని సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డిని, భూమేష్, పోశెట్టి, సుధాకర్‌లను బుధవారం అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా మాజీ గ్రామ సేవకులను కూడా అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు.

నేటి నుంచి స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ



ముథోల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో 100 రోజులు పని పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కుటుంబాలకు నేటి (గురువారం) నుండి స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ జరగనున్నట్లు ఎంపీడీవో శివ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ మండలంలోని తరోడా రైతు వేదికలో రెండు వారాల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుభీర్ రహదారికి పచ్చతోరణం





మండు వేసవిలో కుభీర్ నుంచి భైంసా రహదారిలో ఏపుగా పెరిగిన మొక్కలు

కుభీర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మేజర్ గ్రామపంచాయతీ అధికారులు తాజామాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలను నాటి కంచె ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా మొక్కలకు నీరందించారు. ఇప్పుడు మొక్కలు ఏపుగా పెరిగి కుభీర్-భైంసా రహదారికి పచ్చని తోరణాలుగా తలపిస్తున్నాయి. ఎండ వేడిమి నుండి రక్షణకు ఆ మార్గం గుండా వెళ్లే పాదచారులు సేదతీరుతున్నారు.

వేసవిలో వన్యప్రాణులను రక్షించాలి

● సీసీఎఫ్ శర్వానంద్



నీటి నిల్వలను అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న సీసీఎఫ్ శర్వానంద్



వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన సాసర్‌పిట్

మామడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా వన్యప్రాణులను రక్షించాలని ఫారెస్ట్ బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానంద్ అన్నారు. మామడ సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానంద్ బుధవారం పరిశీలించారు. వివిధ అటవీ అభివృద్ధి పనులను తనిఖీ చేసి వేసవిలో అటవీ జంతువుల దాహం తీర్చేందుకు తీసుకుంటున్న చర్యలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన సాసర్స్, సోలార్ పంపులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇందులో నిర్మల్ డీఎఫ్‌వో నాగిని భాను, ఎఫ్ఆర్‌వో అవినాష్, సిబ్బంది ఉన్నారు.



అడవీ ప్రాంతంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీసీఎఫ్ శర్వానంద్, డీఎఫ్‌వో నాగిని భాను

31 లోపు ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి 25 శాతం రాయితీ

● ఖానాపూర్ మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్‌రావు

ఖానాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 31వ తేదీ లోపు ఎల్ఆర్ఎస్ చెల్లించని వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీని ప్రకటించినట్లు మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రభుత్వానికి ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ప్రకటించినందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయా గ్రామాల పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం ప్రకటించిన రాయితీ వివరాలను తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు.

ముసుగుతీయండి.. మహనీయులను చూడనీయండి



ఖానాపూర్‌లోని ఎన్టీఆర్ చౌక్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఇంకా తొలగించని ముసుగు

ఖానాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నాయకుల, జతీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగు వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27వ తేదీన ముగిసి మార్చి 3వ తేదీన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలు, మార్చి 5వ తేదీన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఎన్నికల కోడ్ ముగియడంతో సంక్షేమ పథకాల చెక్కులను సైతం అధికారికంగా ఖానాపూర్ పట్టణంలో అధికార యంత్రాంగం పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయినప్పటికీ ఎన్నికల కోడ్ సందర్భంగా విగ్రహాలకు వేసి ముసుగులను తొలగించడం మాత్రం అధికారులు మరిచిపోయారని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ కూసిన వెంటనే జాతీయ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసే అధికారు ఆ కోడ్ ముగిసిన వెంటనే సదరు విగ్రహాల ముసుగులను తొలగించడంలో నిర్లక్ష్యం చేయడం పట్ల పలువురు విమర్శలు వ్యక్తచేస్తున్నారు. ఖానాపూర్ పట్టణంలోని ప్రధాన కూడలి అయిన ఎన్టీఆర్ చౌక్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి వేసిన ముసుగును ఇంకా తొలగించకపోవడంతో అధికారులు ఇంకా ఎన్నికల కోడ్ ముగిసినట్లు భావించడం లేదా అని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

మహిళలకు అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

కుంటాల, మార్చి, 12 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక మండల సమాఖ్య భవనంలో బుధవారం మహిళా సంఘాల సభ్యులకు ఏపీఎం అశోక్ పలు రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నేటి సమాజంలో మహిళలను పలు రకాలుగా మోసగించేందుకు మాయమాటలు చెప్పి వలలో వేసుకొని అనంతరం వారికి అన్యాయం చేస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలతో పాటు వివిధ రకాల ఫోన్ కాల్‌ల ద్వారా మహిళలకు మాయమాటలు చెప్పి ఆ తర్వాత వారిని మోసగించడం జరుగుతుండడంతో మహిళలు అప్రమత్తంగా ఉంటూ ఎదుటి వారిని సైతం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేలా ఒకరికొకరు సూచనలు అందించుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో మహిళలు 1098, 108, 100, 181, 1930 నెంబర్లను సంప్రదిస్తే సత్వరమే స్పందించి వారికి న్యాయం చేకూరుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం.. మన చెంతనే!





వెంకటాపూర్‌లో సేకరించిన గోగు పూలతో విద్యార్థులు

మామడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిన్నా.. పెద్ద తేడా లేకుండా సంబురంగా జరుపుకునే పండుగ హోలీ. పిల్లలు, యువత, పెద్దలు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడతారు. అంతా బాగానే ఉన్న ఆ రంగులే రసాయని తమై ఇబ్బందికి గురి చేస్తుంటాయి. ఒక్కటను కుంటే మరొకటి అయ్యేలా సమస్యలు కలిగి స్తాయి. హోలీ రంగుల విషయం లోనూ మనం కాస్త ఆలోచిస్తే మన చెంతనే సహజ సిద్ధమైన పర్యావరణ హితమైన వనరులు కనిపిస్తాయి. మోదుగ చెట్టుకు కాసే గోగుపూలు చక్కగా పని కొస్తాయి. చెట్టు పూలు తెచ్చి ఒక అరగంట శ్రమిస్తే చక్కని అరుణ వర్ణ ద్రావణం తయారవుతుంది. మన రంగులతో మన పండుగ ఉప్పొంగే ఉత్సాహంతో జరుపుకోవచ్చు. పలు మారు మూల గ్రామాల్లో ఈసారి గోగు పూల రంగును వాడుతున్నారు. దీనికి నిదర్శనం మామడ మండ లంలోని వెంకటాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ వీటిని తయారు చేసే విధానాన్ని గ్రా మస్థులకు, విద్యార్థులకు వివరించి, చేసి చూపించారు.

అలా పూలు తెచ్చి.. ఇలా రంగు చేసుకోవచ్చు!

● వీఎస్. శ్రీనివాస్, హెచ్ఎం, వెంకటాపూర్



వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పిల్లలకు ఈ విధంగా తయారు చేసే పద్ధతిని వివరించారు. ప్రతీ గ్రామా ల్లో మోదుగ చెట్లు కనిపిస్తాయి. వాటి పూలను తెంపి కాడను తీసి వేయాలి. తర్వాత పుష్పాల రెమ్మలను ఒక్కొక్కటిగా వేరు చేయాలి. వాటిని నీటిలో వేయాలి. అరగంట పాటు మరిగించాలి. బాగా కలుపుతూ ఉండాలి. తర్వాత ఒక గుడ్డను పెట్టి ద్రావణాన్ని పాత్రలో వడపోయాలి. చల్లారిన తర్వాత సీసాల్లో పోసుకుంటే మన చేత్తో మనం తయారు చేసుకున్న పర్యావరణ హితమైన అరుణ వర్ణం సిద్ధమవుతుంది. ఆ చైనావో ఇంకెవో రంగు తెచ్చుకొని ఇబ్బందులకు గురి కావడం కన్నా పూర్వం మన పెద్దలు ఈ పద్దతిలోనే చేసిన రంగులనే హోలీ నాడు చల్లుకునేవారు. ఉపాధ్యాయురాలు అశ్విని, వీవీ రాజేశ్వరి, పాఠశాల పారిశుద్ధ్య కార్మికురాలు కవిత,వంట మనిషి చాందీలు పాల్గొన్నారు.



రంగును తయారు చేస్తున్న దృశ్యం







మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగులు

మార్కెట్‌లో హోలీ సందడి

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలకు కొత్త అందం తీసుకొచ్చే వసంత రుతువు ప్రవేశించిన తర్వాత జరుపుకునే తొలి పండుగ హోలీ. చిన్నా పెద్ద ఊరువాడ ఏకమై రంగుల్లో తడిసి ముద్దయ్యేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన హోలీ పండుగ రానే వచ్చింది. రంగుల హోలీని ఆనందంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో రంగులు సందడి చేస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన కూడళిలో రంగుల విక్రయాల కోసం వ్యాపారులు ప్రత్యేక దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి ప్రేమికులు సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకుంటున్నారు. యువత మాత్రం పండుగను జరుపుకునేందుకు రంగులను సమకూర్చుకుంటున్నారు. అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్ కూడళ్లలో రంగుల దుకాణాలను ఏర్పాటు చేశారు. రంగులను చల్లుకునేందుకు చిన్న పిల్లల కోసం వివిధ డిజైన్లలో రంగు డబ్బాలను తయారు చేశారు. సాంప్రదాయబద్ధంగా వస్తున్న చక్కెర పేర్లు, కుడుకల దండల అమ్మకాలు సాగుతున్నాయి.



పలు రకాల మాస్కులు



చక్కెర పేర్లు



సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భైంసా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో శనివారం నుంచి ప్రారంభమైన శ్రీవారి 19 వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల కోలాహలం మధ్య కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. వేడుకలలో బాగంగా బుధవారం ఉదయం వేళలో మూల మంత్ర హవనం, సుదర్శన నారసింహ హోమం, నిత్యపూర్ణహూతి, బలి హరణాదులు, నివేదన, మంగళశాసనం కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిగాయి. సాయంత్ర వేళలో నిర్వహించిన సామూహిక శ్రీలక్ష్మీ కుంకుమార్చన కార్యక్రమానికి పట్టణ పరిధి లోని మహిళలే కాకుండా సమీప గ్రామాల నుంచి మహిళా భక్తులు అధి క సంఖ్యలో హాజరయ్యారు. పద్మావతీ కాలనీ పరిధిలో శోభా యాత్ర నిర్వహించారు. మహిళలు కోలాటాలు వేస్తూ, భక్తులు గేయాలు ఆలపి స్తూ నృత్యాలు చేస్తూ శోభయాత్రకు వన్నె తెచ్చారు.



ఉత్సవమూర్తులతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



వాటర్ ట్యాంక్ కుళాయి కింద నీటిలో తడుస్తున్న శునకం

శునకం.. కుళాయి కింద ఉపశమనం!

ఖానాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): క్రమేపి రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు జనం జాగ్రత్తలు పాటిస్తుంటే పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు పశు పక్షాదులు మాత్రం అల్లాడుతున్నాయి. అందుకు నిదర్శనంగా బుధవారం ఖానాపూర్ లోని అయ్యప్ప ఆలయ సమీపంలో శునకం మధ్యాహ్నం సమయంలో వాటర్ ట్యాంకుకు గల కుళాయి నుంచి నీరు లీక్ అవుతుండగా ఆ నీటి కింద ఫీట్లు చేస్తూ ఉపశమనం పొందింది. సుమారు అరగంట పాటు ఈ శునకం చేసిన ఫీట్లను అక్కడున్న వారంతా ఆసక్తిగా గమనించారు. తనివి తీరా నీటితో తడిసిన తర్వాత 'హాహ' ఎంత చల్లగా ఉందో అన్నట్లుగా అక్కడి నుంచి ఈ శునకం జారుకున్న తీరు చూసి అక్కడున్న వారంతా అయ్యో పాపం ఎండ వేడిని తట్టుకునేందుకు జంతువులు ఎన్ని అవస్థలు పడుతున్నాయో అంటూ జాలి పడడం కనిపించింది.



ఎండిన పంటను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్



తాంసి సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పంటలను కాపాడేలా చర్యలు

● 'ఆంధ్రజ్యోతి' కథనంతో పంట పాలాలను పరిశీలించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ● విద్యుత్ శాఖ పని తీరుపై ఆరా

● ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం ● రైతులతో కలుపుగోలుగా మాటామంతీ

తాంసి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలన్నీ అడుగంటి పోయి రబీ పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం చేతికి వచ్చే పంటలు కళ్లముందే ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ విషయమై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో అయ్యో.. అన్నదాత! అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలి సిందే. దీనికి స్పందించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా అదే రోజు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి పంటలను పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. వారు సూచించిన వివరాలను పరిశీలించి బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ రాజార్షి షా తాంసి మండలంలో విస్తృత పర్యటన చేశారు. ముఖ్యంగా రైతుల పంట పొలాల పరిశీలనకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. భూగర్భ జలాలు ఎలా అడుగంటాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఇలాంటి సమస్య ఏర్పడిందా అని పూర్తి వివరాలు సేకరించారు. సుమారు మూడు గంటల పాటు రైతుల పంట పొలాల్లోనే ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రైతులతో ముచ్చటించారు. ప్రస్తుతం పంటలను ఎలా కాపాడుకోవాలో వాటికి ఎక్కడి నుంచి సాగునీరు అందించాలో అనే విష యంపై చర్చించారు. మొత్తం మీద కలెక్టర్ పర్యటన రైతుల్లో సంతోషాన్ని నింపింది.

● విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై ఆరా

తాంసి సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ రాజార్షి షా తనిఖీ చేశారు. 12 రోజుల నుంచి ఎప్పుడు ఎప్పుడు కరెంటు పోయింది. ఎందుకు కరెంటు కట్ చేశారనే విషయంపై ఆరా తీశారు. ఎందుకు కరెంటు సమస్య ఏర్పడిందని ప్రశ్నించారు. సంబంధిత ఏఈ పనితీరు పై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేయగా ఆయనను పిలిపించి పూర్తి వివరాలు సేకరించారు. ఇకనుంచి రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● మత్తడి వాగు నీటి విడుదలపై కలెక్టర్ ఫోన్

తమ పంటలకు నీళ్లు అందడం లేదని వెంటనే మత్తడి వాగు ప్రాజెక్టులో నుంచి నీళ్లు విడుదల చేయాలని హస్నాపూర్, పొన్నారి, వడ్డాది రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులకు ఫోన్ చేసి నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తపరిచారు.

● బోర్ల చుట్టూ ఇంకుడు గుంతలు నిర్మించాలి

ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి పోవడానికి కారణం ఇంకుడు గుంతలు లేకపోవడం అని జిల్లా కలెక్టర్ అన్నారు. వెంటనే రైతుల పంట పొలాల్లో ఉన్న బోర్ల చుట్టూ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వెంటనే పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి. మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ పలువురు అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

పంట పొలానికి మిషన్ భగీరథ నీరు



పొలాలకు నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ఇంద్రవెల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి వ్యవసాయ పొలానికి నీళ్లు పారిస్తున్నారు. మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీ సమీపంలో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల కోసం మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాల క్రితం ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలను ఎక్కడ నుంచి మండలంలోని పాటగూడకు మార్చారు. దీంతో పాఠశాల కోసం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను నుంచి ఓ రైతు వ్యవసాయ పొలానికి నీటిని మళ్లిస్తున్నారు. ఈ వ్యవహారం కొంత కాలంగా జరుగు తోందని గ్రామస్థులు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

అడవి తల్లి అరణ్య రోదన

● పెద్దఎత్తున టేకు చెట్ల నరికివేత ● అడవికి దూరంగా అటవీశాఖ అధికారులు



ఫకీర్‌పేట్ బీట్‌లో కోతకు గురైన టేకు చెట్లు

ఇచ్చోడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అడవి తల్లి అరణ్య రోదనను ఆపేందుకు ఎన్ని ప్రయాత్నాలు చేసిన ఫలితం లేకుండా పోతుంది. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ అటవీ ప్రాంతంలోని ఫకీర్‌పేట్ బీట్‌లో కలప స్మగ్లర్లు పెద్దఎత్తున టేకు చెట్లను నరికివేశారు. టేక చెట్లను నరికి సూజులుగా మార్చి ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నారు. సిరిచెల్మ నుంచి మండల కేంద్రానికి వచ్చే దారిలో మధ్యలో మాన్కాపూర్ గ్రామం వద్ద చెక్‌పోస్టు ఉన్నప్పటికి కలప తరలించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. బెస్ క్యాంపులు ఉన్న సమీపంలోనే టేకు చెట్లు నరికి వేతకు గురికావడంపై అటవీశాఖ పనితీరుకు అద్దం పడుతోంది. ఈ విషయమై టైగర్‌జోన్ ఎఫ్ఆర్‌వో నాగవత్ స్వామిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. టేకు చెట్లు నరికిన విషయం తెలిసింది.. దాదాపు 35 నుంచి 50 టేకు చేట్లను నరికారు. ఇంటి అవసరాల కోసం (గుంజలు, వాసాలు) కోసం టేకు చేట్లను నరికినట్లు కనిపించింది. అవసరమున్నంత వరకు టేకున నరికి మిగితాది అక్కడే వదిలేసి వెళ్లడం జరిగిందని ఎఫ్ఆర్‌వో తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా టేకు చెట్లను నరికినవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కింది స్థాయి అటవీ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఆయన సూచించారు.

సమస్యల వలయంలో వారాంతపు సంత



కుభీర్‌లో రహదారిపైనే కొనసాగుతున్న వారాంతపు సంత

కుభీర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుభీర్ మండల కేంద్రంలో గురువారం జరిగే వారాంతపు సంతలో సమస్యలు నెలకొవడం కారణంగా మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత ద్వారా గ్రామ పంచాయతీకి రూ. లక్షల ఆదాయం వస్తున్న సమస్యలు పరిష్కరించడంలో మాత్రం అధికారులు శ్రద్ధ చూపడం లేదు. వర్షాకాలం వేసవి కాలంలో వ్యాపారస్థులు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● వసతులు కరువు

మండల కేంద్రంలో వారాంతపు సంతలో ప్రతి గురువారం ఆకు కూరలు, కూరగాయలు, కోళ్లు, మేక, గొర్రెల పిల్లలు చేపలు తదితర విక్రయాలు నిర్వహిస్తుంటారు. ఈ సంతకు మండల వాసులతో పాటు పొరుగున గల మహారాష్ట్ర గ్రామాల తదితర గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. సంతకు ప్రత్యేక స్థలం లేక పోవడంతో విఠలేశ్వర స్వామి ఆలయం ప్రధాన రహదారి వెంట అంతర్గత రోడ్లపై నిర్వహిస్తున్నారు.ఈ సంత ద్వారా సంవత్సరానికి రూ. లక్షల ఆదాయం గ్రామపంచాయతీకి సమకూరిన సంతలో వసతులు లేవు. వ్యాపారులు ప్రజలకు త్రాగునీటి వసతి, మూత్రశాలలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. వ్యాపారులకు గుడారాలు షెడ్‌లు, అందుబాటులో లేక పోవడం, వర్షాకాలం వానతో వేసవిలో ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● సంతతో ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రతి వారం నిర్వహించే కూరగాయల సంత ట్రాఫిక్ సమస్య ప్రజలకు ఇబ్బందిగా మారింది. స్థానిక బస్టాండ్ సమీపం నుండి ప్రధాన రహదారి మొదలు విఠలేశ్వర స్వామి ఆలయం నుంచి పోలీస్టేషన్ సమీపం వరకు సుమారు అర కిలోమీటరు వరకు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేస్తారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి, ఆలయాలకు ప్రార్థన మందిరానికి పోలీస్టేషన్ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. వార సంతకు వచ్చే వారి వాహనాలతో పాటు మండలానికి వచ్చే రంజిని, రంజినితండా, జామ్‌గాం, సిర్పెల్లి 2, 3 తండాలు, బెల్గాం, ధార్‌కుభీర్, బెల్గాం తండా 1, 2 , డొడర్న రాంనాయక్ తాండ, డొడర్న దావూజీ నాయక్ తాండా సాయినగర్ తాండ, డొడర్న తాండ2, గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వందలాది వాహనాలు రాకపోకలు చేయడం సంతకు వచ్చే ప్రజలు తీవ్ర ట్రాఫిక్ తిప్పలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికయినా అధికారులు సంతలో సమస్యలు పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన జరగాలని, దానికి వృత్తి నైపుణ్య శిక్షణా ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లో జన్ శిక్షన్ సంస్థాన్ ఆధ్వర్యంలో మూడు నెలల వృత్తి నైపుణ్య శిక్షణను పూర్తి చేసుకున్న వారికి సంస్థ కార్యాలయంలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మహిళలు వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో సంస్థాన్ చైర్మన్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

గంగా జలం కోసం హస్తిన మడుగుకు గోండు గిరిజనులు



గంగా జలం తీసుకువచ్చేందుకు తరలి వెళుతున్న మారుతిగూడ, గోండు గిరిజనులు

ఇంద్రవెల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పండుగలను గోండులు, కొలాం గిరిజనులు వారి సంస్కృతీ, సంప్రదాయంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. గిరిజన గూడేల్లో హోలీ పండుగను సంస్కృతీ, సంప్రదాయంగా జరుపుకునేందుకు అవసరమైన గంగా జలం కోసం గిరిజన గూడెల పెద్దలు మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కల మడుగు గ్రామ శివారులోని గంగానదిలోని హస్తిన మడుగుకు బుధవారం బయల్దేరి వెళ్లారు. గోదావరిలో ప్రత్యేక పూజలు నిర్వహించి గంగా జలాలను తీసుకువచ్చి కాముడి పూజలతో పాటు 9 రకాల వస్తువులతో గుగ్గిలను ఉడికిస్తామని మారుతి గూడ గ్రామ పటేల్ దుర్వ గోవింద్‌రావు, దేవారి దుర్వ యోగేష్‌రావులతో పాటు పలువురు ఈ సందర్భంగా తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు సిరికొండ మండలంలోని పోచంపల్లి, కన్నాపూర్, తదితర గ్రామాల నుంచి గంగాజలం కోసం బయల్దేరి వెళ్లారు. గురువారం సాయంకాలం హోలీ పండుగ సందర్భంగా కాముడి దహనం చేస్తామని, మరుసటి రోజున గంగా జలంతో గుగ్గిలను ఉడికిస్తామని, గుగ్గిలను ప్రతీ ఇంటికి ప్రసాదంగా అందజేస్తామని గిరిజన పెద్దలు తెలిపారు.



బరంపూర్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ప్రణాళికాబద్ధంగా చదివితే వంద శాతం ఉత్తీర్ణత : జడ్పీ సీఈవో

తలమడుగు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చని జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21 నుంచి పదవ తరగతి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని విద్యార్థులు సమయం వృధా చేయకుండా కష్టపడి ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఇందులో ఎంఈవో వెంకట్రావు, హెచ్‌ఎం ప్రత్యూష, ఉపాధ్యాయులున్నారు.



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే

బోథ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడంతో స్థానిక బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ బుధవారం ఆయన హైదరాబాద్‌కు తరలి వెళ్లాడు. ఈ సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావడంతో ఆయన స్వాగతించారు.

'తాగునీటి సమస్య పరిష్కరించరూ!'

తాంసి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు, లింబుగూడ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ తాంసికి చెందిన పలువురు కలెక్టర్‌కు విన్నవించారు. తాంసిలో పురాతన చెరువును బాగు చేయించాలని కోరారు. లింబుగూడ గిరిజనులు తాగునీటితో సతమతమవుతున్నారని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే పరిశీలన బృందాన్ని పంపిస్తామన్నారు. ఇందులో తాంసి గ్రామస్థులు రత్న ప్రకాష్, రాములు, రమేష్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ

బోథ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో బుధవారం వివిధ పాఠశాలల వంట పాత్రలను బుధవారం ఎంఈవో మహమ్మద్ హుస్సేన్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ప్రభుత్వ పరంగా 47 పాఠశాలకు ప్రభుత్వం వంట సామగ్రిని అందివ్వడం జరిగిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయితే వంట పాత్రను వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

జిల్లా నూతన ఎస్పీని కలిసిన దివ్యాంగులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, సంఘం జిల్లా అధ్యక్షుడు బావునే నగేష్ దివ్యాంగుల కేసుల పరిష్కారానికి పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. ఉగ్గే నానయ్య, సయ్యద్ హంజ, మోహన్, శంకర్, వినాయక్ పాల్గొన్నారు.



● గుడిహత్నూర్ మండలంలో ఎండిపోయిన జొన్న పంట



● బోథ్ మండలంలో ఎండిపోయిన మొక్కజొన్న పంట



● తాంసి మండలంలో పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

పంటలు ఎండవట్టే..

- జిల్లాలో ప్రశ్నార్థకంగా మారిన యాసంగి పంటల సాగు
- అడుగంటుక పోతున్న భూగర్భజలాలు, నీటి వనరుల జాడలు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల భగీరథ ప్రయత్నం
- సాగుపై అవగాహన కల్పించని వ్యవసాయ శాఖ
- వాడుతున్న పంటలను చూసి అన్నదాతల ఆందోళన
- జిల్లావ్యాప్తంగా లక్షా 50వేల ఎకరాల్లో సాగవుతున్న వివిధ రకాల పంటలు

ఆదిలాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో యాసంగి పంటల సాగు పెద్ద సవాలుగా మారింది. అష్టకష్టాలు పడి వానాకాలం సీజన్‌ను గట్టెక్కిన అన్నదాతలు.. యాసంగి పంటల సాగుపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే పంటల సాగుకు శ్రీకారం చుట్టిన రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ యేడు వేసవి ప్రారంభంలోనే ఎండల తీవ్రత పెరిగి పోవడంతో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో పంటలకు తడి అందక ఎండుముఖం పడుతున్నాయి. అసలే అంతంత మాత్రంగా నీటి వనరులు ఉన్న జిల్లాలో.. రెండవ పంటకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉండవు. అయినా అతిధీమాతో పంటలను సాగు చేసిన రైతులు.. అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా యాసంగి సీజన్‌లో మొక్కజొన్న, జొన్న, శనగ, నువ్వు, వేరుశనగ, ఇతర కూరగాయల పంటలను అధికంగానే సాగు చేస్తారు. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా లక్ష 50 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. దాదాపు శనగ పంట చేతికి వచ్చినా.. మిగితా పంటల సాగు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో యాసంగి సీజన్‌లో మొక్కజొన్న, వరి పంటల సాగుపై ఆంక్షలు విధించారు. దీంతో అప్పట్లో ఈ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఆరుతడి పంటలను సాగు చేయడంతో పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను సాగు చేసే విధంగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేది కాదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

సాగునీటి కష్టాలు షురూ!

వేసవి ప్రారంభంలోనే సాగునీటి కష్టాలు ఎదురుకావడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఫిబ్రవరి చివరి వరకు జిల్లా సగటు భూగర్భ జలమట్టం 8.5 మీటర్లుగా నమోదైంది. మండిపోతున్న ఎండలకు వేగంగా భూగర్భజలాలు అడుగంటుక పోతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 38 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఇచ్చోడ, బోథ్, గాదిగూడ, బోరజ్, తలమడుగు, జైనథ్, ఆదిలాబాద్‌రూరల్ మండలాల్లో పరిస్థితులు ఝటిలమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఎదురుకావడంతో పలు గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. అందుబాటులో ఉన్న వ్యవసాయ భావుల నుంచి నీటిని తెచ్చుకుంటు దాహం తీర్చుకుంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటుక పోవడంతో పాటు చెరువులు, కుంటలు ఒర్రెలు మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. దీంతో మూగజీవాలకు సైతం తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు. వేసవి పరిస్థితులను ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్తున్నామని అధికారులు చెబుతున్నా.. జరగాల్సిన నష్టం జరిగి పోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుపై అదనపు భారం

చేతికొచ్చిన పంటలు ఎండుముఖం పట్టడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పంట చేన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. సమీపంలో ఉన్న వాగులు, ఒర్రెలు, బావుల నుంచి పంటలకు సాగు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. కిలో మీటర్ల మేర పైపులైన్లను వేస్తూ పంట చేన్లకు సాగునీటిని

(తరువాయి 6వ పేజీలో...)

బోరుబావి ఎండి పోయింది

: మెస్రం శ్యాంరావు, రైతు, భీంపూర్ మండలం



బోరుబావి ఆధారంగా రెండు ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశాను. కానీ బోరుబావి అడుగంటడంతో పంట ఎండిపోయింది. ఇంత తొందరగా భూగర్భజలాలు అడుగంటుకు పోతాయని అనుకోలేదు. సమీపంలో చెరువులు, కుంటలు, వాగులు లేకపోవడంతో సాగునీరు అందించడం కష్టంగా మారింది. దీంతో చేసేదేమీ లేక పంటను వదిలేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు ఎకరానికి పదివేలకు పైగా పెట్టుబడి పెట్టిన పంట చేతికి రాకపోవడంతో నష్టం మిగిలింది.

పక్కరైతు బోరు నుంచి నీళ్లు తీసుకున్నా.. పంట ఎండిపాయే!!

: పెందూరు హీరామాన్, రైతు, గుడిహత్నూర్ మండలం



రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని ఎకరంలో జొన్న పంటను సాగు చేశాను. అసలు చేతికి వచ్చే సమయంలోనే ఎండిపోయింది. పక్క రైతు బోరు నుంచి నీళ్లు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. భూగర్భజలాలు అడుగంటుక పోవడంతో బోరు నుంచి నీళ్లు రావడం లేదు. దీంతో పంటను కాపాడుకునే పరిస్థితి లేక పోవడంతో పూర్తిగా ఎండిపోతుంది. పెట్టుబడి నీళ్లలో పోసినట్లే అయ్యింది. సాగుకు అప్పు చేశా. ఏం చేయాలనో అర్థం కావడం లేదు.

ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

● బంగారిగూడ మోడల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బంగారిగూడ మోడల్ స్కూల్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్నం భోజనం నాణ్యత ప్రమాణాలు, మెనూ ప్రకారం ఈ రోజు చేస్తున్న వంట, స్టోరేజ్, తదితర పరిశీలించారు. మరో వారం రోజుల్లో జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, విద్యార్థులు మంచిగా చదువుతున్నారని పరీక్షలు బాగా రాస్తారని, మంచి మార్కులు సాధిస్తారని భరోసా ఇచ్చారు. ప్రతి తరగతి గదిని పరిశీలించి పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలని, ప్రతిరోజు దిన చర్యలో భాగంగా ఉదయం, సాయంత్రం రివ్యూ చేసుకోవాలని, ప్రత్యేక తరగతులకు హాజరై, వీక్‌గా ఉన్న సబ్జెక్టులపై దృష్టి సారించాలని అన్నారు. ఏకధాటిగా చదవ కూడదని, మధ్య మధ్యలో గ్యాప్ ఇస్తూ చదవాలని అన్నారు. విద్యార్థులకు ప్రతీ అంశంపై క్షుణ్ణంగా వివరిస్తూ, అర్థమయ్యేలా బోధించి, అనంతరం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? లేవా? అంటూ ఆరా తీశారు. ఆయన వెంట ప్రిన్సిపల్ రాజశేఖర్, డీఎంహెచ్ం, ఉపాధ్యాయులు, ఆర్‌బీఎస్‌కే టీమ్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, బంగారిగూడ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు కళ్ల అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కే ద్వారా ప్రతీ స్కూల్స్, హాస్టల్ విద్యార్థులకు వారం నుంచి నిర్వహిస్తున్న స్ర్కీనింగ్ పరీక్షలలో భాగంగా జిల్లాలో 1,780 మందిని గర్తించడం జరిగిందని, బంగారిగూడ మోడల్ పాఠశాలలో 18మందికి దృష్టి లోపం ఉందని గుర్తించి కళ్ల అద్దాలు అందజేశామన్నారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ప్రతీ పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేసవిలో వడ దెబ్బ తలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఇందులో జిల్లా వైద్యాధికారి నరేందర్, ఆర్‌బీఎస్‌కే శ్రీనివాస్, డాక్టర్ సర్ఫరాజ్, నరేందర్, ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

'డిజిటల్ తరగతుల ద్వారా దృశ్య, శ్రవణ నైపుణ్యం పెంపొందించవచ్చు'

జైనథ్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా దృశ్య శ్రావణ నైపుణ్యాన్ని పెంపొందించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి టీ.ప్రణీత అన్నారు. బుధవారం ఉమ్మడి జైనథ్ మండలంలోని ఏజెన్సీ గ్రామమైన జామిని గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వీడీసీ తరపున రూ.60వేల విలువ గల ఎల్‌జీ ఆన్‌డ్రైయిడ్ ఎల్ ఈడీ 55 (4కే) టీవీనీ గ్రామస్థులు జామిని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ టీ.ప్రణీత మాట్లాడారు. ఇందులో జామిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్‌కుమార్ యాదవ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దేవుబాయి, మహాజన్ కృష్ణ, మాజీ సర్పంచ్ పెందూరు మోహన్, మేడిగూడ హెచ్‌ఎం సత్యవాన్‌చిక్టె, స్వేరోజ్ జిల్లా అధ్యక్షులు పెంటపర్తి ఊశన్నలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



జామినిలో పాఠశాలకు ఎల్ఈడీ టీవీని అందజేస్తున్న గ్రామ ప్రజలు



జిల్లా అభివృద్ధి కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పని చేస్తోంది

● కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి

మావల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పని చేస్తోందని, ప్రజలకు గౌరవం కలిగించేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర పరిధిలోని అంశాలు 10 ఏళ్ల అడగలేని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రస్తుతం రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రజలను తప్పుదారి పట్టిస్తూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. జిల్లా అభివృద్ధి విషయంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఆదిలాబాద్ ప్రజలకు కనీస అభివృద్ధి కూడా చేయలేకపోయారని విమర్శించారు. బీజేపీ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలిచినప్పటికీ గిరిజన విశ్వవిద్యాలయం తరలింపును ఆపేంత శక్తి లేకపోవడం వాళ్ల వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూమి సిద్ధం చేసినా, సీసీఐ ఫ్యాక్టరీని తుక్కు కింద అమ్మడానికి కేంద్రం ఆదేశాలిచ్చినా.. స్థానిక బీజేపీ నేతలు పట్టించుకోవడం లేదని వారి తీరును ఎండగట్టారు. రైల్వే ప్రాజెక్టు నిధులు మంజూరు చేయించడంలో బీజేపీ ఎంపీ ఏమాత్రం చొరవ చూపించలేదన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నికల్లో ఓటు అడిగే సమయంలో అభివృద్ధి మాటలు చెబుతారు, గెలిచాక ప్రజలకు కనిపించరనీ ఘాటుగా విమర్శించారు. రోడ్లు, విద్య, వైద్యాన్ని మెరుగుపరిచే దిశగా ఒక్క అడుగు కూడా వేయడం లేదను, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టే విషయంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇక బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు గిరిజన విశ్వవిద్యాలయాన్ని ములుగుకు తరలించిన తీరు వారి నిర్లక్ష్యాన్ని చూపుతోందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, వేముల, సీనియర్ నాయకులు నవీన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి